

# విద్యార్థి ఉద్యోగి

అరిగె రామారావు

"ఈ స్టేట్‌మెంట్ తయారు చేసింది నీవేనా? అచ్చం నీ మొగం లాగా వుంది."

'తప్పులేం ఉన్నాయో చెప్పండి.'

'డోంటాక్. వళ్ళుదగ్గర పెట్టుకుని చూడు. ఏం వున్నాయో తెలుస్తుంది. యూ- గెట్ (వుట్?' అని గర్జిస్తూ చేతిలోని ఫైలు నామీద కిసిరేశాడు. ఆ అధికార మదోన్మత్తుడు. మా అఫీసరు,

ఆఫైలువచ్చి సూటిగా నా మొగానికి తగిలి కిందపడింది. ఆ ఆఫీసర్ని నమిలి మింగుదామన్నంత కోపంవచ్చింది, కాని నేనొక సామాన్యమైన గుమస్తాను గుమస్తా కోపం గుమస్తాలోనే వుండాలి. బయటికి ప్రదర్శిస్తే వుద్యోగానికి వున్వాసన తప్పదు. ఎలాగో నా కోపాన్ని దిగమింగుకుని క్రింద పడ్డ ఫైలుం తీసికుని బయటికి వచ్చాను.

నా సీట్లోకివచ్చి కూలబడ్డాను. నాకు భోరున ఏడ్వాలనిపించింది. కాని ఆఫీసు అయిపోయింది. నా మూణ్ణెళ్ళ సర్వీసులో ఆఫీసరుతో తిట్లుతినటం చాల సార్లయింది. ఫైలు మొగాన వేసికొట్టటం ఇదే మొదటి సారి! ఇది నా ఆత్మాభిమానం మీద కొట్టిన దెబ్బ. నేను ఆఫీసుపని చేతగాని వాజమ్మను కాదు. నేను తయారుచేసిన స్టేట్‌మెంట్ అకౌంటెంట్ కూడ చూశాడు. అయన ద్వారానే లోపలికి వెళ్ళింది. ఆఫీసర్లు ఎగిరేగిరి పడటానికి కారణం గుమస్తాల అసమర్థత ఒక్కటే కారణంకాదు. ప్రస్తుతం వాళ్ళలోని అధికార గర్వం!

ఆఫీసుపనిమీద మనస్సు లగ్నం చేయలేకపోతున్నాను. మనస్సు మూగగా రోదిస్తుంది. నన్నొక దైవస్వరూపునిగా, సొంత ప్రాణంగా చూచుకునే నా భార్యగుర్తుకు వచ్చింది. ముద్దులు మూటకట్టే నా చిన్నారి పాపలు కళ్ళల్లో మెదిలారు, నన్ను చూడగానే పమిటనిండుగా కప్పుకునే మా అత్తగారు, లేచినిలబడే మరదళ్ళు గుర్తుకు వచ్చారు, వీళ్ళందరికీ నేనంటె ఎంతో గౌరవం. కాని, మా ఆఫీసరు దృష్టిలో నేనొక పురుగును.

చచ్చి ఏలోకాన వున్నదో, మా అమ్మ గుర్తుకువచ్చింది. 'నాతండ్రి పెద్ద ఆఫీసరవుతాడ'ని నన్ను తెగముద్దులాడేది. తన కొడుకు పెద్ద ఆఫీసరు కాలేదు, ఫైళ్ళునిసిరికొట్టే పెద్దఆఫీసరు కింద ఒకచిన్నగుమస్తా అయ్యాడని అమ్మకెలా తెలుస్తుంది.

నేను స్కూల్లో చదువుకునే రోజులు గుర్తుకువచ్చాయి. నేను స్కూలుఫైనల్ చదువుతుండగా నేనంటె పడిచచ్చే తాసీలారుగారి కూతురు కనకవల్లి గుర్తుకు వచ్చింది. ఆరోజుల్లో నాపేరు రౌడీ సుబ్బారావు. నేనంటె స్కూలులో మాష్టర్ల దగ్గర్నుంచి హెడ్మాష్టారు వరకు హడలు నాకొక గ్యాంగు వుండేది. నేనా గ్యాంగుకు నాయకుడ్ని. మా స్కూలులో మాగ్యాంగులో వాళ్ళతో ఎదిరించి మాటాడటానికెవరికీ దమ్ములుండేవికావు, మాగ్యాంగంటె మావూళ్ళో వాళ్ళకు కూడ భయమే! ఈ మధ్య స్టూడెంట్ వాకుర్రళ్ళంటె అందరికీ భయమే. కాని మాగ్యాంగంటె ఇంకా భయం? చచ్చేహడలు, ఒకసారి రేట్లు పెంచాడని నాయరు హోటలుమీదకు దాడి చేసి కుర్చీలు, బెంచీలు యిరగ్గొట్టిపెట్టాం. ఇంగ్లీషు మ్యాట్నీలు ఆడటంలేదని మావూరి సినిమాహాలు ప్రొప్రయిటరుతో తగాదపడి రాళ్ళురువ్వి సినిమాహాలులో లైట్లు, ప్రొజక్టరు ధ్వంసం చేశాం. మాలో 'కోతిగాడు' అనే ఒక కొంటెవాడు. సువర్చల అనే ఒక ధనవంతులపిల్ల స్కూల్లో తనని తిట్టిందనే కోపంతో, ఆపిల్ల సినిమాకెళ్ళి వస్తుంటె ఆపిల్ల బారెడు జడను చీకట్లో వెనకనుండి

కత్తిరించి పారిపోయాడు. ఇలా ఎన్నో అఘాయిత్యాలు చేశాం.... ఇలా గజిబిజిగా అల్లిబిల్లిగా నా మనస్సులో కదులుతున్న గతస్మృతుల తెరలను తొలగించుకుని మా తెలుగుమాష్టారు సీనయ్యగారి జాలిగొలిపే మొగం ఒక 'ఫ్లాష్'లాగా కనిపించింది. ఆయనిది జాలిగొలిపే వుదంతం. దానికి కారకులం మేమే! ఆరోజుల్లో ఆ వుదంతం మాకొక గొప్పగర్వ కారణమయింది. కాని ఇప్పుడుదాన్ని తలుచుకుంటుంటే సిగ్గుతో నాతల వాలిపోతుంది. పశ్చాత్తాపాగ్నిలో నా మనస్సు కాలిపోతుంది....

● ● ●

మేము స్కూలుఫైనలు చదువుతుండగా సంవత్సరం మధ్యలో సీనయ్య మాష్టారు ఏదో వూర్నుంచి [ఆయన సొంత వూరు నుండి] మా వూరిస్కూలుకు ట్రాన్సఫరయి వచ్చారు. ఆయన మాకు తెలుగుకు వచ్చేవారు. మామూలుగా తెలుగు మాష్టార్లలో వుండే చతురత, హాస్య ఈయన్లో కూడ వున్నాయి; ఇంకోపాలు ఎక్కువే వున్నాయేమో కూడ. ఇవే కాకుండా ఆయనలో ఒక విధమైన ఠీవి, ఆత్మాభిమానం కూడవున్నాయి. ఆరోజుల్లోవీటిని మేంచెప్పే అహంకారం,గీర్వాణంగాచెప్పుకునేవాళ్ళం.

ఆయన మాస్కూలుకువచ్చిన వారం పదిరోజులు కనుకుంటా, ఒకరోజు మా క్లాసులో ఏదో సందర్భంలో [ఆసందర్భం ఏమిటో యిప్పుడు నాకు బాగా గుర్తులేదు] మావూరిని, మావూళ్ళో మనుషులను మాస్కూలును తేలిగ్గా మాటాడారు. నిజానికి ఏదో హాస్యానికని వుంటారు. కాని అప్పట్లో మాకది హాస్యానికన్నట్లుగా కాకుండా, ఏదో ఎత్తిపొడుపుగా, వెటకారంగా అన్నట్లుగా అనిపించింది. మాకందరికీ కోపం తెప్పించింది. బ్రతుకు తెరువు కోసం మావూరొచ్చి మావూరికే వంకలు పెట్టుతాడా అని తెగ ఆవేశపడిపోయాం. ఈ వార్త. ఆ సాయింకాలని స్కూల్లో అన్నితరగతుల పిల్లలకు. మాష్టర్లకుతెలిసిపోయింది. అంతటితో ఫలానక్లాసులో ఫలానవిధంగా వూర్నిగురించి వెగతాళిగా మాట్లాడారు. వాళ్ళతో ఇలా అన్నారు వీళ్ళతో అలా అన్నారు అని ఆయన అన్నవి అననివి చిలవలు పలవలుగా చెప్పుకోవటం మొదలు పెట్టారు.

మర్నాడు మా గ్రూపు అంతా హెడ్మాష్టరు దగ్గరకుపోయాం ఈవూరిపట్ల, ఈ స్కూలుపట్ల కొత్తగా వచ్చిన సీనయ్య మాష్టారి నిర్లక్ష్య వైఖరిని, ఆయన అన్న మాటలను చెప్పి, ఆయనమీద చర్య తీసుకోవాలని డిమాండ్ చేశాం. మా మ్యుతా సంగతి. మేం పట్టుపట్టితే వదలమని బాగా తెలిసున్న హెడ్మాష్టారు వెంటనే సీనయ్యగార్ని ఆయనగదిలోకి పిలిపించారు. విషయమేమిటని అడిగారు. ఎస్సెల్సీక్లాసులో ఏదో సందర్భంలో, "మీ తప్పేమీలేదు, తప్పంతా మీ వూరి ఎర్రనీళ్ళల్లోనే వుంది." అని హాస్యానికి అన్నమాట నిజమేనని చెప్పుకున్నారు. ఆయన అసలు అనని మాటలు, నిజానికి ఆయనకి తెలియని విషయాలుకూడ అన్నారని ఏవేవో ఆరోపించాము. ఆయన. "రామ రామ, నే నంతకు మించి ఇంకేమీ అనలేదు!" అని మొత్తుకున్నారు.

ఎన్నో ఆరోపణలు, వాద ప్రతివాదాలు, చర్చలు అయిన తర్వాత చివరికి ఆయన విసిగిపోయి, "నేనేదో హాస్యాని కన్న దానికి ఇంత పెద్ద రాద్ధాంతం చేస్తారేమిటి? నేను హాస్యంగా అన్నది మీకు పెద్ద తప్పుగా తోస్తే అందుకు క్షమార్పణ చెప్పుకుంటాను." అని అన్నారు.

"ఇంకేమయ్యా క్షమార్పణ చెప్పుకుంటామంటున్నారుకదా:" అని హెడ్మాష్టారు అన్నారు.



కాని మేం వప్పుకోలేదు. స్కూలును గురించి అన్నదానికి స్కూల్లో క్షమార్పణ చెప్పుకోవాలి; వూళ్ళోవాళ్ళను గురించి అన్న దానికి పెద్దబజార్లో గాంధీ విగ్రహందగ్గర వూళ్లో పెద్దలముందు క్షమార్పణ చెప్పుకోవాలి అని మేం పట్టుపట్టాం.

అందుకాయన కోపంగా, "క్లాసులో జరిగినదానికి సెంటర్లో వూళ్ళోవాళ్ళముందు నేనెందుకు క్షమార్పణ చెప్పుకోవాలి? ఏమైనాసరే నేను చచ్చినా చెప్పను. ఏం చేస్తారో చేసుకోండి;" అని అన్నారు.

ఆమాటతో మాకు పట్టుదల పెరిగింది. ఏమైనాసరే సెంటర్లో గాంధీ బొమ్మదగ్గర క్షమార్పణ చెప్పుకొని తీరవల్సిందేనని మేం మొండిపట్టు పట్టి కూర్చున్నాం. "ఏమైనాసరే నేను చెప్పేది లేదు. మీకు చేతనయింది మీరు చేసుకోండి;" బింకంగా అని కుర్చీలోంచి లేచిపోయారు విసురుగా.

ఆయన పెంకెకు మేం ఇంకా రెచ్చిపోయాం. "ఏమైనాసరే మీ మాటమీదే వుండండి!" అని ఇద్దరు ముగ్గురు మాష్టర్లు చాటుగా మాతో అని మమ్మల్నిఎక్కేశారు.

మా వూళ్ళో కొంతమంది ఏమీ పొద్దుపోని పోసుకోలు రాయళ్ళున్నారు. చేతిలో ఒక దినపత్రిక పెట్టుకుని, సెంటర్లో కొట్లకాడ కూర్చుని ఎందుకూ పనికిరాని విషయాలు చర్చిస్తూ వుండటమే వాళ్ళపని. వాళ్ళు వాడిజుట్టు వీడికి, వీడిజుట్టువాడికి ముడిపెట్టుతూవుంటారు. ఈ విషయం వాళ్ళదాకా పోయింది. ఆ సాయంత్రానికి వాళ్ళు మా దగ్గరికి వచ్చారు— "పొరుగూరివాడు. అందులో బ్రతకలేని బడిపంతులు, పొట్టతెరువుకోసం మనవూరొచ్చి మనవూర్ని అనేవాడా? వీడంతేమిటో చూడండి మేం మీ వెనకాల వుంటాం." అని మమ్మల్ని ఎక్కేసి. మాలో రగులుతున్న కోపాన్ని యింకా ఎగదోశారు.

అంతటితో మాకు ఎక్కడలేని వుషారెక్కింది.

"ఎలాక్షమార్పణచెప్పడో చూస్తాం; మన వూరి తడాఖా చూపిస్తాం." అని ఆవేశంగా పలికాం.

సీనయ్య మాష్టారు మీద ఎలా దెబ్బతీయాలి, ఆయన్ని ఎలా సాధించాలి అనే విషయాన్ని చర్చించటానికి రాత్రి ఎనిమిది గంటలకు మా ఊరిబయటవున్న మొగిలి చెరువు కళింగం దగ్గర అందరం సమావేశమయ్యాం. సరే మనకు చేతనయింది చేద్దాం; ఆయనకి ఊళ్ళో పచ్చి మంచినీళ్లు కూడ ముట్టకుండా చేద్దామని ఒక ప్రతిపాదన లేవదీయబడింది. అంతే, క్షణాల మీద ఒక కార్యక్రమాన్ని తయారు చేశాం.

దాన్నిబట్టి ఆ రాత్రికిరాత్రి అంతాకలిసి సైకిళ్ళమీద సీనయ్య మాష్టారుకు రోజూ వాడికగా పాలుపోసే అప్పడి గుడిశకెళ్లాం. రేపట్నుంచి మాష్టారుకు పాలుపోయవద్దని. పోశావా నీగేదెలు యాత్రకి దేశాంతరం

పోతాయని వార్నింగ్ యిచ్చాం. ఆ గుడి శల్లో వుండే మిగతా పాలవాళ్ళకి కూడ వార్నింగ్‌యిచ్చి, మామాట కాదని పాలు పోశారో మీ పాకలు పీకేస్తాం. ఏ పశువులను దేశాలుమీదకు తోలేస్తాం అని బెదిరించాం. అక్కడ్నుంచి మంచి నీళ్ళ బ్రాహ్మడు పార్వతీశం యింటికెళ్ళాం. కొత్తగావచ్చిన సీనయ్యమాస్టారికు రేపట్నుంచి మంచినీళ్ళుపోశావా. పీపాని ముక్కలుచేసి చలిమంట వేసుకుంటాం అని హెచ్చరించాం. అలాగే వ్యాపారికొట్ల వాళ్ళు కూరగాయల కొట్లవాళ్లు హోటళ్ళు రేపట్నుంచి సీనయ్య మాస్టారికి ఏవస్తువూ అమ్మకుండా వుండటానికి కట్టుదిట్టంచేశాం చాకలిపేట వెళ్లాం. ఇలాటి విషయాల్లో మా ఊరి రజకులు ముందువుంటారు. "కానియ్యండి అబ్బాయిగారు!" అని వాళ్ళే వుషారు యిచ్చారు.

తెల్లారగట్టె వెళ్ళి మాష్టారుండే వీధి కటు మలుపు ఇటుమలుపు మా వాళ్ళు బీటు కాశారు. పొద్దుగూక్నుంచి వచ్చే కూరల తట్టలుకాని, పాల సైకిళ్ళుగాని ఆయన యింటి పోకుండా కాపలాకాయటానికి; అలాగే ఆ యింటినుంచి ఎవరైనా బజారు వస్తువులకోసం బయటికి వస్తే వాళ్ళను కనిపెట్టి వెంబడించి వాళ్ళకా వస్తువు దొరక్కుండా చేయటానికి. వాళ్ళ పనిమనిషి రామి పాచిపని చేయటానికి వస్తుండేదాన్ని మధ్యలోనే అటునుంచి అటే పంపించేశారు. మాష్టారు వాళ్ళకు ఏ వస్తువు ఇవ్వకూడదు, ఏ విధమైన సహాయమూ చేయకూడదని యిరుగు పొరుగు వాళ్ళనుగూడా గట్టిగా హెచ్చరించాము. వూళ్ళోవాళ్లు మాకు దడిసి కొందరు మా పనిని హర్షించి మాకు మద్దతు ఇవ్వాలని కొందరు ఘొత్తానికి అందరూ మాతో సహకరించారు.

ఆ విధంగా నాలుగు వైపులనుండి కమ్ముకొచ్చి ఆయన్ని, ఆయన కుటుంబాన్ని చక్రబంధం చేశాం. ఈ క్షణాల ఆయనకు మా వూళ్ళో మంచినీళ్ళ చుక్కయినా పుట్టకుండా చేశాం. మంచినీళ్ళకు వాళ్ళ దొడ్లోనే బావివుంది. కనుక చేసేది లేదు!

ప్రొద్దెక్కిన కొద్దీ వాళ్ళపాట్లు వాళ్లకి తెలిసివచ్చాయి. మాష్టారుకు పోతపాలు (గేదెపాలు) త్రాగే పసిపిల్ల వుంది. ఆ పిల్లకు పాలులేవు. ఆ పిల్ల యిల్లెగిరి పోయేటట్లు ఏడుపు మొదలు పెట్టింది. వంట వండుకూడానా లేదు. త్రాగటానికి మంచినీళ్ళు లేవు. మా అందరికీ అపరిమితమైన ఆనందాన్ని కలిగించిన విషయమేమిటంటే మాష్టారుకు నశ్యం అలవాటువుంది. ప్రతి అయిదు నిముషాలకు ఒక చిటికెడు పొడుం ముక్కుల్లోకి దట్టించనిదే ఆయన "ఆయన"గా వుండలేడు. కర్మానికి శాపం ఆయన దగ్గరవున్న నిల్వ పొడుం సరిగ్గా ఆ రోజుకి అయిపోయింది కాబోలు, ఆయన నశ్యడబ్బా పట్టుకుని పొడుంకోసం వూరంతా తిరగటం, అలవాటుపడ్డ ప్రాణం పొడుంకోసం కొట్టుకులాడుతుండగా, మాష్టారు కాలుకాలిన పిల్లిలాగా చిందులు త్రొక్కటం, ఏమీ చేయలేని అసహాయ స్థితిలో మా వంక మిర్రి మిర్రి చూడటం మా ఆనందానికి కారణాలయ్యాయి.

మాష్టారు దురదృష్టానికొద్దీ మేం ఈ పని నెలాఖరు రోజుల్లో ప్రారంభించాం. నెలకు సరిపడ తెచ్చుకున్న బియ్యం, పప్పులూ, ఉప్పులూ సరిగ్గా ఇదే సమయంలో ఒకటి రెండు రోజుల తేడాతో నిండుకున్నాయి. మాష్టారు కుటుంబం పస్తులు పడుకుంటుంది. ఇలా నాలుగు రోజులు గడిచేసరికి మాష్టారుకు, ఆయనింట్లో వాళ్ళకు ప్రాణాలు కళ్ళలోకి వచ్చాయి. ఆయన కుటుంబ జీవితం మా [illegible] స్తంభించిపోయింది!

ఆయన ఈ లోపల పంచాయతీబోర్డు ప్రెసిడెంట్ దగ్గరకు పోయి తన గోడు చెప్పుకున్నాడు. ఈ పంతులు మన వూర్ని తిట్టేవాడా అనే కడుపు మంటతో కొంత మా మాటకు దడిచి కొంత మొత్తానికి వాళ్ళందరూ ఈ విషయంలో జోక్యం కల్పించుకోవటానికి విముఖత కనబరిచారు. సీనయ్య మాష్టారు మా దెబ్బ తట్టుకోలేక వూరొదిలి పోవటానికి శలవు పెట్టినట్లు మాకు వార్త అందింది. మా వూరికి రైల్వే స్టేషను పదమూడుమైళ్ళ దూరంలో వుంది. ఎక్కడికి పోవాలన్నా బస్సుల్లోనే పోవాలి. మాష్టారు వూరొదిలి లేచిపోయే ఆలోచనలో వున్నాడని మాకు తెలియగానే మేం బస్సు వోనర్ల దగ్గరకెళ్ళాం. మాష్టారు కుటుంబం బయటికి పోవటానికి వీలు లేదని చెప్పాం. "అయ్యో, మీరు చెప్పటమూ మేము కాదంటమోనా" అని అన్నారు వాళ్లు.

ఈ విధంగా మేము బయటికిపోయే దారులు కూడా మూసేశామని తెలిశాక మాష్టారు పూర్తిగా హతాశులైపోయారు. మనిషి నిలువునా క్రుంగిపోయినట్టు కనిపించారు.

మేము రోజూ రాత్రిళ్ళు పొద్దుపోయే వరకు మామూలు స్థలం చెర్వుకళింగం మీద కూర్చుని సిగరెట్లు త్రాగుతూ ఆ రోజు జరిగిన విశేషాలను చెప్పుకునే చెప్పమని నవ్వుకుని, మర్నాటి కార్యక్రమం నిర్ణయించటం జరుగుతుంది.

మా సమ్మె ప్రారంభమైన రాత్రి [illegible] మేం అంతా పేకాట ఆడుకుంటుండగా మాష్టారు భార్య చీకటో లాంతరు పట్టుకుని, పదేళ్ళ కొడుకును వెంటపెట్టుకుని కళింగం దగ్గరకొచ్చింది. జువ్విచెట్టుకిందవున్న వినాయకుడి బొమ్మ దగ్గర నిల్చుని, నన్ను పిల్చుకుని రమ్మని కొడుకును పంపించింది.

నేను కాలుస్తున్న సిగరెట్టును అవతల పారేసి, ఆ కటిక చీకట్లో భయంకరంగా వున్న జువ్విచెట్టు క్రింద దీనంగా నిలబడి వున్న ఆమె దగ్గరకెళ్ళినిలబడ్డాను. నావెంట యిద్దరు కుర్రకాళ్లు వచ్చారు.

కొన్నిక్షణాలు ఆమె వూరికే మమ్మల్ని చూస్తూ నిలబడింది. జువ్విచెట్టు ఆకుల సందుల్లోంచి నక్షత్రాలు గుడ్డివెలుగు ఆమె మొగంమీదపడి ఆమె మొగంలోని విషాదాన్ని స్పష్టాను స్పష్టంగా కనపడ్తోంది.


ఆమె మెల్లగా. "సుబ్బారావు అంటె నీవేనా బాబు?" అని అడిగింది.

"అవునండీ!" అన్నాను.

"ఎందుకుబాబు, మమ్మల్ని ఇలా ఏడిపించుకుని తింటున్నారు?"

"విషయాలన్నీ మీకు తెలిసేవుండాలి?"

అన్ని రకముల రేడియోలకంటే హెచ్చుగా కొనబడుచున్న



# బుష్ బారన్

ఈ రోజుననే మీకు దగ్గరగానున్న డీలర్ వద్ద చూచికొనండి!

పల్లెటూళ్ళకూ, ప్రయాణాలకూ, బహుమతులకూ వీలైన చక్కని ట్రాన్సిస్టర్!

★

డిస్ట్రిబ్యూటర్లు:

## నారాయణ్ రేడియో స్టోర్సు

విజయటాకీసు సెంటరు. ఫోను నెం. 6489. విజయవాడ-2.

---

బుష్ నమ్మదగిన మంచి రేడియో!

నా ప్రక్కనవున్న ఆచారి అనాడు.

"తెల్సు, బాబు! తెల్సు. పోనీ ఆ క్షమార్పణ ఏదో చెప్పండి అని నేను ఆయన్ని రెండు రోజులుగా బ్రతిమలుతుంటే, నవేమిరా చెప్పనని ఆయన మొండిపట్టు పట్టికూర్చున్నారు. ఆయనకు అభిమానం ఈ...స్తి. మొదట్నుంచి మొండిఘటం బాబు! ఆయన ఏదో అన్నారని ఈ పసిపిల్లల్ని తిండి తిప్పలు లేకుండా నల్లుల్ని మాడ్చినట్టు మాడ్చటం మీకు బాగునదా బాబు! పోనీ వూరొదిలి పోనియ్యకుండా చేశారు. మీ పేదవ యింటల్లొ పాది ప్రాణాలు వదిలి పెట్టమంటారా?"

"మరి ఆయనకే అంత అభిమానం మొండి పట్టుదల వుంటే మాకేనా వుండవిది?"

"ఆయన వినందే ఏం చేయమంటారు? పోనీ ఆయన భార్యగా ఆయన తరపున ఆ క్షమార్పణ ఏదో నడిబజార్లో నలుగురు ముందూ నేనే చెప్పుకుంటాను. పోనీ అంతకైనా వప్పుకోండి!" అని అంది దీనాతిదీనంగా.

మాష్టారు భార్య అలా ఆ చీకట్లో కుర్రాడ్ని వెంటపెట్టుకుని రావటం మాముందు నిలబడి అంత దీనంగా ప్రాధేయపడటం నా కప్పటికే ఏదోచెయ్యి గుండెల్ని దేవుతున్నట్లనిపిస్తోంది.

"మీరెందుకండీ చెప్పటం?" అని అన్నాము. ఎలాగో మాటల్ని కూడదీసుకుంటూ.

బహుశా నా ప్రక్కనవున్నవాళ్ళకి కూడ అలాగే అనిపించిందేమో! "అవునండి. మీరు చెప్పటం దేనికండీ?" అని అన్నారు.

"మరేం చేయమంటారు చెప్పండి. మీ మీ పంతాలుకోసం నా బిడ్డల్ని నేను చంపుకోమంటారా?"

మేం మాటాడకుండా తలలు వంచుకుని నిలబడ్డాము. మాకు సమ్మెలు చెయ్యటం తెలుసు. ఆందోళన చెయ్యటం తెల్సు. బస్సులు తగలపెట్టటం తెలుసు. కాని సూటిగా గుండెల్ని తాకి మానవత్వపు కుదుళ్ళను వూపుతూ అడిగే ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు మాకేం తెలుసు??

మేం ఏమీ మాటాడకపోవటం చూచి ఆమె ఒకడుగు ముందుకేసి, నా రెండు చేతులూ పట్టుకుని, "బాబు, సుబ్బారావు! నీ తల్లిలాంటిదాన్ని!" నీ చేతులు పట్టుకుని వేడుకుంటున్నాను. నామీద దయచూపు నాయనా కనీసం మమ్మల్నీ వూరొదలిపెట్టి పోవటానికైనా వప్పుకోండి." అని జాలిగా అడిగింది.

'నీ తల్లిలాంటిదాన్ని! 'అన్న మాట సూటిగా నా గుండెలకొచ్చి తగిలింది.

"నీ తల్లిలాంటిదాన్ని!"

ఎప్పుడో నా చిన్నతనంలో చనిపోయిన మా అమ్మ గుర్తుకు వచ్చింది. నేను వెనకాలపడి ఏడుస్తూ వస్తుంటే మా అమ్మను ఈ చెర్వు ప్రక్కనున్న శ్మశానంలోకే తీసికెళ్ళారు. మా అమ్మ మన్నయి ఈ ప్రక్కనున్న మట్టిలోకే కలిసిపోయింది.

చెర్వు మీదుగా, స్మశానం మీదుగా వీచిన గాలి జువ్విచెట్టు ఆకుల్లో చిక్కుకొని సన్నగా రోదిస్తుంది. మట్టిలో కలిసిపోయిన మా అమ్మ ఆత్మే, 'ఇదేంటిరా సుబ్బీ!' అని అంటూ రోదిస్తున్నట్లనిపించింది.

నా తల్లిలాంటి ఒక తల్లికి నేను చేస్తుంది ఏమిటి?

"సరేనండి. మీరే తెల్లారగట్ట మొదటి బస్సులో వెళ్ళండి. నేను చేయగలిగిలిది ఇంతవరకే. మేం. ఇంతాచేసి మధ్యలో పూరుకుంటె వూరివారితో గొడవవస్తుంది" అని అన్నాను.

నా నిర్ణయం నా స్నేహితులకు కూడ ఆమోదయోగ్యంగా వుందనుకుంటాను. "మీ ప్రయాణానికెమ్మేమే అన్ని ఏర్పాట్లూ చేస్తాం." అని అన్నారు.

ఆమె తేలిగ్గా వూపిరి వదులుతూ,"అదే పదివేలు బాబు!" అని అంది.

"పదవండి.మీ యింటివరకు వచ్చి దిగపెట్టుతాం." అని అంటూ వినాయకుడి బొమ్మ ముందు పెట్టిన మసిబారిన లాంతరును చేతిలోకి తీసికున్నాను. అలాలాంతరు తీసుకుంటుండగా లాంతరు గుడ్డి వెలుగులో చదువులకు దేముడయిన ఆ వినాయకుడు మా చదువుల తీరు చూచి నవ్వుతున్నట్లనిపించింది.

ఆ తెల్లారగట్ట స్టేషన్కెళ్ళే మొదటి బస్సులో సీనయ్య మాష్టారు కుటుంబంతో సహా అలా మా వూరొదిలి వెళ్లిపోయారు.

● ● ●

గత జ్ఞాపకాలతో మనస్సు అంతా వికలమయిపోయింది. ఇంతలో లంచ్ టైం అయింది. తెరిచిపెట్టిన పైలు మూసేసి బయటికొచ్చాను. ఒక గమ్మత్తు జరిగింది. సీనయ్య మాష్టారు అప్పుడే బస్సు దిగి బస్సుస్టాండ్లోంచి బయటికి వస్తూ కనిపించారు. నిజమా కలా అనిపించింది. కొన్ని నిమిషాలక్రితం మాష్టారి కథ మనసులో మెదలటం. తెలిసీ తెలియక ఆయనకు చేసిన అన్యాయానికి కుములుతూ వుండగా, పన్నెండు సంవత్సరాలనుండి కనిపించని మాష్టారు ఇలా అకస్మాత్తుగా కనిపించటం దైవఘటనే అనుకోవాలి! ఇన్నేళ్ళ తర్వాత దైవికంగా కనిపించిన మాష్టారుకు క్షమార్పణ చెప్పుకుంటేగాని తృప్తిగా వుండదు.

ఆయన్ని, "నమస్కారం మాష్టారు!" అని పలకరించాను మొదట్లో ఆయన నన్ను గుర్తుపట్టలేదు. గుర్తుపట్టిన తర్వాత "ఓర్ని నీవటోయ్ సుబ్బారావు!" అని నవ్వుతూ భుజంమీద చేయివేశారు.

ఆయన్ని బలవంతంచేసి నాతోపాటు హోటల్కు తీసికెళ్ళాను. ఆయన వద్దంటున్న కొద్దీ గులాబ్జాం తెప్పించి తినమని బలవంతం చేశాను. ఆయన తింటుండగా, "మాష్టారు, మీరు నన్ను క్షమించగలరా?" అని అడిగాను.

ఆయన తలఎత్తి. "దేనికి?" అని. కాసేపు ఆలోచించి "ఓహో. మీవూళ్ళో మాకు చేసినసన్మానానికా? దాన్దేముందోయ్! ఇటీవలకాలంలో అలాటివి మామూలు అయిపోయాయి. ఎన్నెన్నో చూస్తోన్నాం. అది వయస్సులోని లోపం; వ్యవస్థలోని లోపం; సామాజిక పరిస్థితుల ప్రభావం." అని అన్నారు.

కొన్ని క్షణాలవరకు ఏమీ మాటాడలేకపోయాను. తర్వాత మెల్లగా అన్నాను. "నిజంగా మీరు చెప్పిన మూడో కారణమే యీనాటి విద్యార్థిలోకంలోని అసహ్యతకు కారణమనుకుంటాను, ఆ రోజుల్లో మీరు ఒక చిన్నమాట అన్నదానికి మేము అంత రాద్ధాంతం చేశాం, మీరనేకాదు ఏమాష్టారయినాసరే మమ్మల్ని ఏదయినా మాట

అంటె ఎదిరించేవాళ్ళం. పోట్లాడేవాళ్ళం స్ట్రయిక్ అనేవాళ్ళం. బంద్ అనేవాళ్ళం. నిజంగా మాకు విద్యాబుద్ధులు గరిపే మీరు ఏమన్నా అనవచ్చు. గురువు అంటె దైవసమానులు అన్నారు కదండి! మీరేమన్నా మా బాగుకోసం, మమ్మల్ని సక్రమమార్గంలో పెట్టటం కోసమే! దానికి విద్యార్థులు వూరికే గింజుకుంటున్నారంటె అవివేకమే అని అనాలి. విద్యార్థిదశ దాటినతర్వాత అసలు జీవితంలోకి అడుగుపెట్టిన తర్వాత ఎన్నెన్ని సమస్యలను ఎదుర్కోవాలో తెలుసుకోలేకపోతున్నారు. ప్రస్తుతానికి నా విషయమే తీసికోండి. మాతోపాటు జీతానికి పనిచేసే ఆఫీసరు ఎన్నిమాటలు అన్నా కిక్కురు మనకుండా పడివుంటున్నాం. ఫైళ్లు మొగాన విసిరికొట్టుతున్నా సహిస్తున్నాం. పైపెద్దు వాళ్ళ దయకోసం ప్రాకులాడుతున్నాం.

"విద్యార్థిదశలో ఒక్కరోజైనా, 'నమస్కారం మాష్టారు!' అని రెండు చేతులు కలిపి ఏమాష్టారికైనా దణ్ణంపెట్టామా? అదే ఈ వుద్యోగదశలో ప్రతి పై అధికారికి వంగి వంగి సలాంలు చేస్తున్నాం. విద్యార్థిగా పిర్రవీగిపోయినవాడు ఈ రోజున ఆఫీసుల్లో ఆత్మాభిమానం చంపుకుని నిస్సహ బతుకు బ్రతుకుతున్నాడు. నా విషయమే తీసికోండి మాష్టారు! ఈ రోజంటె ఈ రోజు, రెండుగంటల క్రితం వుత్తపుణ్యానికి మా ఆఫీసరు ఫైలు విసిరి నా మొగాన కొట్టాడు.... ఏం చేయగలిగాను........ అదే మీరేదో హాస్యానికన్నదానికి ఒక పెద్ద గ్రూపుతయారేసి, దానికి నాయకత్వం వహించి మిమ్మల్ని అష్టకష్టాలు పెట్టా-"

మాష్టారు నావంక ఆశ్చర్యంగా చూస్తూ,

"మీకు కూడ ఏవో సంఘాలునాయి కదా! ఇలాటి పరంతాలను ఎందుకు ప్రతిఘటించరు?" అని అడిగారు.

"ఇది దురంతం కాదండి. అతి సామాన్యమైన విషయం. అసలీ గుమస్తాబ్రతుకే అంత. ఈ వ్యవస్థే అంత! నేనేదో కొత్తగా జేరాను కాబట్టి తెగ ఆవేశపడిపోతున్నాను. పాతపడినకొద్దీ ఈజీవితం అందరికీ అలవాటయిపోతుంది. అన్నీ చంపుకుని ఈ వుద్యోగాలు చేస్తున్నారు. ఎవరికీ ఇలాటి వాట్ని యూనియన్లదృష్టికి తీసికెళ్ళాలని కూడ అనిపించదు. ఎందుకంటె ఆఫీసర చేతిలో ఒక మారణాయుధం కాకపోతే బ్రహ్మాస్త్రం వుంటుంది. దానిపేరే "కాన్ఫిడెన్షియల్ రిపోర్టు". ఆఫీసరుకెదురు తిరిగితే సైలెంట్‌గా దాన్ని ప్రయోగిస్తాడు. దానిలో కావల్సిన కన్ఫర్మేషన్లు కాకుండా వెనక్కిపోతాయి. జీతం రాళ్ళమీద బ్రతుకులు వెళ్ళమారుస్తున్నవాళ్ళు చూస్తూచూస్తూ కొరివితో తలగోక్కుంటారా?"

ఇంతలో హోటల్ గడియారంలో వంటిగంటయింది. నేను కంగారుగా బిల్లు తీసికుని నిలబడి- "ఇకపదండి మాష్టారూ. మా లంచ్ టైం అయిపోయింది. ఒక్క క్షణం అటూఇటూగా వెళ్ళినా మా ఛండశాసనుడు వూరుకోడు-" అని అన్నాను.

ఆయన నవ్వి, "ఎవరయ్యా అంత ఛండశాసనుడు. ఇంతకీ నీవే ఆఫీసులో పనిచేస్తున్నావు?" అని అడిగారు. చెప్పాను.

"అకౌంట్స్ సెక్షను లోనా?"

"అవునండి. ఇక వస్తాను మాష్టారు! నన్ను మీరు మనస్ఫూర్తిగా క్షమించాను అని అంటేగాని నాకు తృప్తి వుండదు; ఈ గుండెలు తేలికపడవు-"

"దాన్దేముందిలేవోయ్!" అని ఆయన ఎంతో అభిమానంగా నాభుజంమీద చేయి వేశారు. నిజంగా ఆ క్షణంలో నా గుండెలు ఎంతో తేలికపడ్డాయి.

"వస్తాను, మాష్టారు!" అని మాష్టార్ని హోటల్ బయటగేటు దగ్గర వదిలేసి కంగారుగా ఆఫీసువయిపు నడకసాగించాను.

వుదయంనుండి పేరుకుపోయిన ఫైళ్ళు చూస్తూ కూర్చున్నాను. ఒక అరగంట గడిచినతర్వాత ఆఫీసుప్యూను వచ్చి, అయ్యగారు పిలుస్తున్నారని చెప్పాడు. మళ్ళీ ఏం మూడిందోరా బాబు అని అనుకుంటూ. నోట్లోవున్న పక్కపొడిని పదిసార్లు బయటికివుమ్మి భయంభయంగా ఆఫీసరు గదిలోకి వెళ్ళాను.

ఆశ్చర్యం!

సీనయ్య మాష్టారు ఆఫీసరెదురుగుండా కుర్చీలో కూర్చుని వున్నారు. నాకంతా అయోమయంగావుంది - మాష్టారు ఇక్కడ కూర్చోవటమేమిటి? నన్ను పిలిపించటమేమిటి?

మాష్టారు నన్ను చూపిస్తూ, "ఇతను నా పూర్వ విద్యార్థిరా రామం," అని ఆఫీసరుతో చెప్పారు.

"-రా, రామం!" ఏమిటిది?

"వీడు మా పెద్దాబ్బాయివోయ్! నేను మీ వూరికి ట్రాన్సఫరయి వచ్చినప్పుడు వీడు స్కూలుఫైనలు చదువుతున్నాడు. సంవత్సరం మధ్యలో చదువు పాడవుతుందని మా అక్కగారింట్లో వదిలేసి వచ్చాం-"

"ఓహో-అమ్మ చెప్పిన సుబ్బారావనే ప్రబుద్ధుడు ఇతనేనన్నమాట!"-అయ్యగారి మొగంలో కాస్త ప్రసన్నత కనిపించింది.

"ఇతడ్ని కాస్త కనిపెట్టివుండరా! మరీ అంత కటువుగా వుండవద్దు-" అని అన్నారు మాష్టారు కొడుకుతో.

ఆయన నవ్వి, "సర్లే-" అని నా వంక చూచి. "దట్సాల్ రైట్!" అన్నాడు!

నిజంగా సీనయ్య మాష్టారెంత మంచివారు! ఎందుకనో నాకు కళ్ళు నిండుగా నీళ్ళువచ్చాయి. సీట్లోకూర్చుని ఎవరూ చూడకుండా చేతిగుడ్డతో కళ్ళు వత్తుకున్నాను.

●●●

---

● ఒక యింట్లో జొరబడి వస్తువులు ధొంగిలించాడనే నేరంమీద ఒక ముద్దాయిని విచారిస్తున్నాడు జడ్జిగారు.

ముద్దాయితరపు వకీలు "అయ్యా! ఈ ముద్దాయి ఇంటిలో చొరబడలేదు. అతడు దోవన వెడుతూండగా ఆ యింటి కిటికీతీసి వుండటం గమనించాడు. వెళ్ళి కుడిచెయ్యి లోపలపెట్టి ఆ దినవస్తువులు తీసుకున్నాడు. అతని కుడిచెయ్యి చేసిన తప్పుకు అతన్ని దండించడం చాలా అన్యాయం" అని వాదించాడు.

జడ్జి, తెలివిగా "అయితేసరే" అతని కుడిచేతికి మూడువేల్ల విడిఖైదు విధిస్తున్నాను. ఆ చేతితోపాటు అతడూ వుండదలుచుకుంటే ఉండవచ్చు. లేకపోతే మానేయవచ్చు అన్నాడు.

ముద్దాయి గంభీరంగా తన చెక్కచేతిని తీసి బల్లమీద వుంచి వెళ్ళిపోయాడు.